సాక్షి సాగుబడి

2023ను అంతర్జాతీయ చిరుధాన్యాల సంవత్సరంగా ఐక్యరాజ్యసమితి సర్వసభ్య సమావేశం ఇటీవల ప్రకటించడం మన వర్షాధార వ్యవసాయదారులకు వరం. చిరుధాన్యాల పౌష్టికత, పర్యావరణపరమైన ప్రయోజనాలను ప్రపంచానికి చాటి చెప్పడానికి భారత్ చేసిన కృషి ఫలించింది.

– కృష్ణ బైరె గౌడ, కర్ణాటక పూర్వ వ్యవసాయ మంత్రి

శతభిష కార్తె : మార్చి 16 వరకు, ఉత్తరాభాద్ర కార్తె : మార్చి 17 నుంచి

గ్రహం అనుగ్రహం

సోమవారం – 15.3.2021 – శ్రీశార్వరినామ సంవత్సరం, ఉత్తరాయణం, శిశిర ఋతువు, ఫాల్గుణ మాసం, తిథి శు.విదియ సా.5.31 వరకు, తదుపరి తదియ, నక్షత్రం రేవతి రా.3.32 వరకు, తదుపరి అశ్విని, వర్జ్యం ప.2.30 నుండి 4.15 వరకు, దుర్ముహూర్తం ప.12.32 నుండి 1.21 వరకు, తదుపరి ప.2.54 నుండి 3.44 వరకు, అమృతఘడియలు...రా.12.55 నుంచి 1.44 వరకు

సూర్యోదయం 6.13
సూర్యాస్తమయం 6.06,
రాహుకాలం ఉ.7.30 నుండి 9.00 వరకు
యమగండం ఉ.10.30 నుండి 12.00 వరకు

డా. వైఎస్సార్ వర్సిటీ శాస్త్రవేత్తల సూచనలు

ఫోన్ ద్వారా ఉద్యాన పంటలు పండించే రైతుల సందేహాలకు డా. వైఎస్సార్ ఉద్యాన విశ్వవిద్యాలయం రైతుల సలహా కేంద్రం ద్వారా శాస్త్రవేత్తలు రోజుకు ఒక పంటపై మధ్యాహ్నం 3 గం. నుంచి 4 గం. వరకు సూచనలు ఇవ్వనున్నారు. ఈ నెల 15న కొబ్బరి సాగులో శాస్త్రీయ పద్ధతులపై అంబాజీపేట ఉద్యాన పరిశోధనా స్థానం హెడ్, ప్రధాన శాస్త్రవేత్త డా. బి.వి.కె. భగవాన్ (73826 33653) సూచనలిస్తారు. ఈ నెల 16న వేసవిలో టమాట సాగుపై మదనపల్లి ఉద్యాన పరిశోధనా స్థానం హెడ్, సీనియర్ శాస్త్రవేత్త డా. ఎం.జి.బాలహుస్సాని (81062 20148) సూచనలిస్తారు. ఈ నెల 17న దుంప పంటల రకాలు –విత్తన సేకరణపై కొవ్వూరు ఉద్యాన పరిశోధనా స్థానం సీనియర్ శాస్త్రవేత్త డా. కె. మమత (94410 89174) సూచనలిస్తారు. ఈ నెల 18న వేసవిలో జీవాల పెంపకంలో మెళకువలపై పెరియవరం కెవికె శాస్త్రవేత్త డా. పి. మంజరి (89500 39083) సూచనలిస్తారు. ఈ నెల 19న అల్లం సాగులో మెళకువలపై చింతపల్లి ఉద్యాన పరిశోధనా స్థానం హెడ్, శాస్త్రవేత్త డా. బి. శివకుమార్ (73820 24496) సూచనలిస్తారు. ఈనెల 20న వేసవిలో కోళ్ల యాజమాన్యంపై వెంకటరామన్నగూడెం కెవికె శాస్త్రవేత్త డా. టి. విజయనిర్మల (83285 80955) సూచనిస్తారు.

ఏప్రిల్‌లో డా. చోహాన్ క్యూ సహజ సాగుపై శిక్షణ

దక్షిణ కొరియాకు చెందిన ప్రసిద్ధ శాస్త్రవేత్త డా. చోహాన్ క్యూ సహజ సాగు పద్ధతిపై ఆయన శిష్యురాలు, సౌత్ ఆసియా రూరల్ రీకన్‌స్ట్రక్షన్ అసోసియేషన్ (ఎస్.ఎ.ఆర్.ఆర్.ఎ.) వ్యవస్థాపకులు రోహిణీ రెడ్డి ఏప్రిల్ 16 సాయంత్రం నుంచి 19 మధ్యాహ్నం వరకు శిక్షణా శిబిరం నిర్వహించనున్నారు. చిత్తూరు జిల్లా పులిచర్ల గ్రామంలోని డా. చోహాన్ క్యూ సహజ వ్యవసాయ క్షేత్రంలో శిక్షణ ఇస్తారు. మిగతా వివరాలకు రోహిణీ రెడ్డిని ఫోన్ ద్వారా లేదా ఈ–మెయిల్ ద్వారా సంప్రదించవచ్చు.. 99859 47003, kodirohini@gmail.com

రాబోయే 2023 సంవత్సరాన్ని అంతర్జాతీయ చిరుధాన్యాల సంవత్సరంగా జరపాలని ఐక్యరాజ్య సమితి జనరల్ అసెంబ్లీ ఇటీవల తీర్మానించటం ఎంతో హర్షదాయకం. 2018ని భారత ప్రభుత్వం జాతీయ చిరుధాన్యాల సంవత్సరంగా ప్రకటించి.. చిరుధాన్యాలను 'పోషకాల ధాన్యాలు'(న్యూట్రిసెరియల్స్)గా అధికారిక గుర్తింపునిచ్చింది. భూతాపం అంతకంతకూ పెచ్చుమీరుతున్న పరిస్థితుల్లో ప్రజలు చిరుధాన్యాలను రోజువారీ ప్రధాన ఆహారంలో భాగం చేసుకోవాల్సిందిగా పిలుపునిస్తూ చిరుధాన్యాల సాగు, ప్రాసెసింగ్, పరిశోధనలకు సంబంధించి అనేక కార్యక్రమాలను భారతీయ వ్యవసాయ పరిశోధనా మండలి (ఐసీఏఆర్) అనుబంధ సంస్థలు చేపట్టాయి.

చిరుధాన్యాలకు పునర్వైభవం!

డా. విలాస్ ఎ తొనపి,
సంచాలకులు, భారతీయ చిరుధాన్యాల పరిశోధనా సంస్థ, హైదరాబాద్
director.millets@icar.gov.in

ఆ నేపథ్యంలోనే 2023ను అంతర్జాతీయ చిరుధాన్యాల సంవత్సరంగా ప్రకటించాలన్న డిమాండ్‌ను మన దేశం ఐక్యరాజ్య సమితి ముందుంచింది. కేంద్ర వ్యవసాయ మంత్రి అధ్యక్షతన గల ఉన్నత స్థాయి స్టీరింగ్ కమిటీ ఆధ్వర్యంలో ఈ కృషి అంతా జరిగింది. 2018 అక్టోబర్ 4న ఆహార–వ్యవసాయ సంస్థ (ఎఫ్.ఎ.ఓ.)కు చెందిన వ్యవసాయంపై కమిటీ 26వ సమావేశంలో ఈ ప్రతిపాదన జరిగింది. తదనంతర కాలంలో ఎఫ్.ఎ.ఓ. కౌన్సిల్, ఎఫ్.ఎ.ఓ. కాన్ఫరెన్స్ సైతం ఈ ప్రతిపాదనను ఆమోదించాయి. ఈ పూర్వరంగంలో 2023ను అంతర్జాతీయ చిరుధాన్యాల సంవత్సరంగా జరుపుకోవాలన్న ప్రతిపాదనకు ఐక్యరాజ్య సమితి సర్వసభ్య సమావేశం ఇటీవల ఆమోద ముద్ర వేసింది.



అంతర్జాతీయ సంవత్సరంలో ఏం చేస్తారు?

ఈ అంతర్జాతీయ చిరుధాన్యాల సంవత్సరంలో ప్రపంచవ్యాప్తంగా నిర్వహించే వివిధ కార్యక్రమాల రూపకల్పనలో భారతీయ చిరుధాన్యాల పరిశోధనా సంస్థ ముఖ్య భూమికను పోషిస్తోంది. 2023లో అంతర్జాతీయంగా, జాతీయంగా, రాష్ట్రాల స్థాయిలో వర్క్‌షాపులు నిర్వహించి రైతులు, వినియోగదారులు, తదితరులలో చైతన్యాన్ని కలిగిస్తారు. ప్రభుత్వ కార్యాలయాల్లో లెటర్ హెడ్స్, ఎన్వలప్ కవర్లపై చిరుధాన్యాల గుణగణాలను, విలువ ఆధారిత ఉత్పత్తుల వివరాలతో కూడిన నినాదాలను ముద్రిస్తారు. డిపార్ట్‌మెంటల్ క్యాంటీన్లు, స్టోర్లలో చిరుధాన్యాల ఉత్పత్తులను అందుబాటులో ఉంచుతారు. రాష్ట్ర/జిల్లా స్థాయిలో జొన్నలు, సజ్జలు, రాగులతో పాటు కొర్రలు, సామలు, అరికలు, ఊదలు, అండుకొర్రలు వంటి చిరుధాన్యాలలో పౌష్టిక విలువలు, వాటితో వివిధ వంటకాలను తయారు చేసుకొని వినియోగించే పద్ధతులను వివరిస్తూ సభలు, సమావేశాలను నిర్వహిస్తారు. చిరుధాన్యాల సాగును, విలువ ఆధారిత ఉత్పత్తుల తయారీని ప్రోత్సహిస్తూ ఐసీఏఆర్ సంస్థలు, కేవీకేల్లో కిసాన్ మేళాలు నిర్వహిస్తారు. చిరుధాన్యాలను విస్తారంగా పండించే రాష్ట్రాల్లో చిరుధాన్యాల దత్తత గ్రామాల రూపకల్పనకు కృషి జరుగుతుంది. చిరుధాన్యాల పౌష్టిక విలువలు, పర్యావరణ ప్రయోజనాలపై పత్రికలు, ఎలక్ట్రానిక్, సోషల్ మీడియాలో విస్తృత ప్రచారం కల్పిస్తారు. పోషక విలువలు అధికంగా ఉండే చిరుధాన్యాల కొత్త వంగడాలకు ప్రాచుర్యం కల్పిస్తారు. చిరుధాన్యాలకు కనీస మద్దతు ధర చెల్లించి కొనుగోళ్లు చేపడతారు. మధ్యాహ్న భోజన పథకం వంటి సాంఘిక రంగ పథకాల్లో చిరుధాన్యాలతో వండిన ఆహారాన్ని వడ్డించడం ప్రారంభించవచ్చు. అంతర్జాతీయ సంస్థల ద్వారా నిధులను సమకూర్చుకొని ఇటువంటి పనులపై ప్రపంచ వ్యాప్తంగా ప్రచారోద్యమాన్ని ప్రారంభించడానికి అవకాశం ఉందని భారత్ ఐక్యరాజ్యసమితికి ప్రతిపాదించింది.

ఇక అనాథ పంటలు కావు..

మానవులు తొలుత సాగు చేసి ఆహారంగా తీసుకోవటం ప్రారంభించిన తిండి గింజలు చిరుధాన్యాలే. ముఖ్యంగా ఆఫ్రికా, ఆసియా దేశాల్లో చిరుధాన్యాలను 9 కోట్లకు పైగా ప్రజలు ముఖ్య ఆహారంగా తింటున్నారు. 30కి పైగా దేశాల్లో 50 కోట్ల మందికి జొన్నలు ముఖ్య ఆహారం. 131 దేశాల్లో జొన్నలు, తదితర చిరుధాన్యాలు ప్రధాన ఆహార పంటలుగా సాగవుతున్నాయి. పెరుగుతున్న భూతాపం వ్యవసాయంలో సవాళ్లను జటిలం చేస్తున్నందున, ప్రజల్లో పోషకాహార లోపం పెరుగుతున్నందున చిరుధాన్యాలను ఆహారంలో భాగం చేసుకోవాల్సిన ఆవశ్యకత మరింత ఏర్పడింది. అయితే, వరి, గోధుమ, మొక్కజొన్న వంటి ఆహార ధాన్యాలు విరివిగా వాడుకలోకి వచ్చిన గత కొన్ని దశాబ్దాలుగా చిరుధాన్యాల సాగు, వినియోగం క్రమంగా తగ్గుతూ వచ్చాయి. ఈ పంటలు ప్రోత్సాహం కరువై అనాథ పంటలుగా మారిపోయాయి.

కొద్దికాలంగా భారతీయ చిరుధాన్యాల పరిశోధనా సంస్థ తీసుకున్న చొరవ వల్ల ప్రజల్లో చైతన్యం కలిగి చిరుధాన్యాల వినియోగం గణనీయంగా పెరిగింది. ఇప్పుడు 2023ను అంతర్జాతీయ చిరుధాన్యాల సంవత్సరంగా ప్రకటించినందున ఈ పంటలకు విశ్వవ్యాప్తంగా ఆరోగ్యకర ఆహారాలుగా పునర్వైభవం దక్కడం ఖాయం.

చిరుధాన్యాలే ఎందుకు?

పెరుగుతున్న భూతాపం ఆహార పంటల దిగుబడులు, నాణ్యతకు గొడ్డలిపెట్టుగా మారుతున్నది. చిరుధాన్యాలు ప్రధానంగా మెట్ట పంటలు. 65–85 రోజుల్లో కోతకొస్తాయి. కరువును తట్టుకుంటాయి. 150–500 ఎం.ఎం. వర్షపాతం ఉన్నా పండుతాయి. చౌడును, అధిక ఉష్ణోగ్రత (46 డిగ్రీల సెల్షియస్ వరకు)ను తట్టుకుంటాయి. ప్రతికూల, వాతావరణంలో తీవ్ర మార్పులనూ తట్టుకుంటాయి.

పౌష్టికాహార లోపాన్ని అధిగమించేందుకు ప్రపంచ ప్రజలకు ఉపయోగపడతాయి. చిరుధాన్యాల్లో ఐరన్, జింక్, ఫోలేట్, కాల్షియంతో పాటు ప్రొటీన్లు, పీచు పదార్థం, యాంటీ ఆక్సిడెంట్లు పుష్కలంగా ఉంటాయి. గ్లైసెమిక్ ఇండెక్స్ మొక్కజొన్నలు, వరి, గోధుమలకన్నా తక్కువ కాబట్టి మధుమేహ రోగులకు మంచిది. భూగోళానికీ మంచిది. చిరుధాన్యాలు కొద్దిపాటి ఎరువులు, పురుగుమందులతోనే పంట దిగుబడులనిస్తాయి. వీటిని పండించడానికి కొంచెం నీరు చాలు. ప్రకృతిపై వత్తిడిని తగ్గిస్తాయి. ఆహారంగా, పశుదాణా/గ్రాసంగా, జీవ ఇంధనంగానూ వాడుకోవచ్చు. అంతర్జాతీయంగా ఆహార భద్రత, పౌష్టికాహార భద్రత సాధనకు.. అనేక సుస్థిర అభివృద్ధి లక్ష్యాల సాధనకు చిరుధాన్యాలు దోహద పడతాయి.

వ్యవసాయ క్షేత్రంలో సాగులో ఉన్న వివిధ రకాల కూరగాయలు

ఆకుకూరలను కట్టలు కడుతున్న మహిళలు

ఎత్తు మడులపై వత్తుగా శ్రీసేద్యం!

నగరాలు, పట్టణాల పరిసర ప్రాంత ప్రజల్లో ఆరోగ్య స్పృహ పెరుగుతున్నకొద్దీ రసాయనిక అవశేషాల్లేని సేంద్రియ ఆకుకూరలు, కూరగాయలకు మార్కెట్‌లో డిమాండ్ ఇనుమడిస్తోంది. రైతులు ఈ అవకాశాన్ని అందిపుచ్చుకోవాలంటే.. ముఖ్యంగా మూడు విషయాలపై దృష్టి పెట్టాలి. రైతు తనకున్న పొలంలో ఒకటీ రెండు రకాల కూరగాయలో, ఆకుకూరలో పండిస్తే ప్రజల అవసరాలన్నీ తీరవు. కాబట్టి స్థానిక ప్రజలు ఇష్టపడే 25 రకాల ఆకుకూరలు, కూరగాయలను ఎంపిక చేసుకోవాలి. అవి కూడా ఏడాది పొడవునా సేంద్రియ పద్ధతుల్లో మిశ్రమ పంటలు పండించి ఇవ్వగలగాలి. మధ్యవర్తులకు అమ్ముకుంటే రైతుకు మిగిలేది తక్కువే. అందుకని, వాట్సప్, టెలిగ్రామ్ వంటి సోషల్ మీడియా గ్రూప్‌ల ద్వారా వినియోగదారులతో టచ్‌లో ఉంటూ నేరుగా వారికే అమ్ముకోవాలి. వారినే పొలం దగ్గరకొచ్చి కొనుక్కెళ్లేలా ప్రోత్సహించాలి. తద్వారా సేంద్రియంగా పండిస్తున్నారో లేదో అన్న సందేహమూ ఉండదు. సన్న చిన్నకారు రైతులకు ఈ పనులన్నీ ప్రణాళికాబద్ధంగా చేయాలంటే.. అందుకు అవసరమైన ప్రత్యేకమైన నైపుణ్యాలు ఉండాలి.. శ్రీ సేద్య రైతు సేవా సంస్థ సరిగ్గా ఇటువంటి ఆచరణాత్మక శాస్త్రీయ సాగు, మార్కెటింగ్ నైపుణ్యాలను రైతులకు అందిస్తోంది. నాబార్డ్ వంటి సంస్థల తోడ్పాటుతో రైతులకు శిక్షణ ఇస్తున్న ఈ సంస్థ కృషికి మెచ్చి ఎమ్మెస్ స్వామినాథన్ ఫౌండేషన్, మహీంద్రా అగ్రి వంటి సంస్థలు పురస్కారాలను అందించి ప్రోత్సహించాయి కూడా.

- ప్రణాళిబద్ధంగా సేంద్రియ కూరగాయలు, ఆకుకూరల సాగు
- ఎకరంలో ఏడాది పొడవునా 25 పంటల సాగు
- ఎత్తు మడులపై డ్రిప్, మల్చింగ్.. రెట్టింపు మొక్కలు.. రెట్టింపు దిగుబడి
- పశువుల ఎరువు, వర్మీ కంపోస్టు, వేస్ట్ డీ కంపోజర్, జీవన ఎరువులు, వర్మీ వాష్ వినియోగం
- సోషల్ మీడియా సాయంతో నేరుగా వినియోగదారులకే విక్రయం
- రెండు నెలలకోసారి రైతులకు శిక్షణా శిబిరాలు
- శ్రీ సేద్య రైతు సేవా సంస్థ విశేష కృషి

నల్లగొండ పట్టణ సమీపంలోని గిరకబాయి గూడెంలో ఎకరం భూమిని కౌలుకు తీసుకొని 25 రకాల కూరగాయలు, ఆకుకూరలను సేంద్రియ పద్ధతుల్లో శ్రీ సేద్య రైతు సేవా సంస్థ సాగు చేస్తున్నది. వ్యవసాయ రంగంలో కూరగాయల సాగుతోనే ఆర్థిక అభివృద్ధి లభిస్తుందని భావించిన సంస్థ రైతులకు ఆదర్శంగా ఉండడంతోపాటు స్వతహాగా సాగు చేయడం ద్వారా దిగుబడిని పొంది, నేరుగా వినియోగదారులకే అమ్ముకునే మార్కెటింగ్ విధానాన్ని రైతులకు అలవాటు చేస్తోంది. బీఎస్సీ చదివి కొన్ని ఏళ్లు డ్రిప్ డీలర్‌గా పనిచేసిన రూపాని రమేష్ పదేళ్ల క్రితం వ్యవసాయంపై దృష్టి సారించారు. ఆరేళ్ల క్రితం నుంచి అధిక సాంద్రతలో ఎకరంలో 25 వరకు కూరగాయ, ఆకుకూర పంటలను సేంద్రియ పద్ధతుల్లో సాగు చేస్తున్నారు. వీరి సాగు పద్ధతిలో ఎన్నో ప్రత్యేకతలున్నాయి..

పశువుల ఎరువు.. వేస్ట్ డీ కంపోజర్..

ఏడాది పొడవునా కూరగాయ పంటలు మంచి దిగుబడిని ఇవ్వాలంటే.. సేంద్రియ పద్ధతుల్లో భూసారం పెంపుదలకు దీటైన ప్రణాళిక ఉండాలి. ఎకరానికి ఏడాదికి 8 ట్రాక్టర్ల పశువుల ఎరువు, 5 క్వింటాళ్ల వేపపిండి, ఒకటిన్నర క్వింటాళ్ల పొగాకు పొడి, ఒక క్వింటా ఆముదం పిండి, వర్మీకంపోస్టు.. దఫ దఫాలుగా భూమికి అందిస్తారు. దీనికి తోడు జీవామృతం, వేస్ట్ డీ కంపోజర్, వర్మీ వాష్ వంటి ద్రవరూప ఎరువులు డ్రిప్ ద్వారా తరచూ అందిస్తున్నారు.

3 రోజులకోసారి పిచికారీ

కూరగాయ పంటల్లో దిగుబడి దెబ్బతిన కుండా ఉండాలంటే ప్రతి 3 రోజులకోసారి ఏదో ఒక ద్రావణాన్ని పిచికారీ చేయక తప్పదని తమ అనుభవంలో రుజువైందని రూపాని రమేష్ తెలిపారు. వేస్ట్ డీకంపోజర్ పురుగుమందుగా కూడా బాగా పనిచేస్తోంది. వర్మీ వాష్‌ను భూమికి ఇవ్వటంతోపాటు పిచికారీ కూడా చేస్తున్నాం. బవేరియా, నీమాస్త్రం, అగ్ని అస్త్రం పిచికారీ చేస్తాం. శిలీంధ్ర తెగుళ్లకు సూడోమోనాస్ పిచికారీ చేస్తామన్నారు.

ఎఫ్.పి.ఓ. ఏర్పాటు

రమేష్ ఆధ్వర్యంలో ఎఫ్3 ఫార్మర్ ప్రొడ్యూసర్ కంపెనీ ఏర్పాటైంది. ఇందులో 491 మంది రైతులున్నారు. వీరిలో వివిధ పంటలు పండించే 50 మందిని సేంద్రియ రైతుల బృందంగా ఏర్పాటు చేశారు. అన్ని పంటలతో పాటు పుట్టగొడుగులు, పండ్ల తోటల రైతులు కూడా ఇందులో ఉన్నారు. ఉత్పత్తులను మూడు హోటళ్లకు అందిస్తున్నారు. మార్కెట్ ధరలను బట్టి సేంద్రియ ఉత్పత్తుల ధరల్లో మార్పులు చేసుకుంటున్నామని రమేష్ తెలిపారు.

సోలార్ డ్రయ్యర్

టమాటో, ఆకుకూరల వంటివి ఎక్కువగా ఉత్పత్తి అయ్యి, అమ్మకాలు అంతగా లేనప్పుడు వాటిని సోలార్ డ్రయ్యర్‌లో ఎండబెడుతున్నారు. తేమ 8–9% ఉండేలా టమాటో ఒరుగులు తయారు చేసి వాటితో పచ్చడి పట్టి విక్రయిస్తున్నారు. కొత్తిమీర, ఆకుకూరలు, మునగాకును ఎండబెట్టి పొడులుగా మార్చుతున్నారు. వృథాను తగ్గించుకొని అదనపు ఆదాయం వచ్చేలా చూసుకోవటం ద్వారా లాభాలు పెంచుకునేలా జాగ్రత్తలు తీసుకుంటున్నారు.

– కుంభం వెంకటేశ్వర్లు గౌడ్, సాక్షి, నల్లగొండ రూరల్

రైతులకు పరిపూర్ణ శిక్షణ ఇస్తున్నాం

సేంద్రియ ఉత్పత్తులను ఇష్టపడే స్థానిక ప్రజలు ఏయే పంటలు ఇష్టపడుతున్నారో తెలుసుకొని, అక్కడి మార్కెట్ అవసరాలకు అనుగుణంగానే ఆయా పంటలను ఉత్పత్తి చేసుకోవాలి. సేంద్రియ బహుళ పంటల సాగు, అధిక దిగుబడి వ్యూహాలు, మార్కెటింగ్ మెలకువలు, సస్యరక్షణ పద్ధతులపై రైతులకు రెండు నెలలకోసారి 3 రోజుల పాటు పరిపూర్ణ శాస్త్రీయ శిక్షణ ఇస్తున్నాం. మొదటి రోజు నుంచి చివరి రోజు వరకు ఏయే రోజుల్లో ఏమేమి పనులు చేయాలి? వనరులు ఏమి కావాలి? ఎంత ఖర్చవుతుంది? కూలీలు ఎందరు కావాలి? ఇవన్నీ చెబుతున్నాం. తక్కువ విస్తీర్ణంలో ఎక్కువ రకాల కూరగాయల సాగు ద్వారా రైతులు ఆర్థికాభివృద్ధిని సాధిస్తారు. ప్రభుత్వం ప్రోత్సహించాలి.

– రూపాని రమేష్ (94417 22817), అధ్యక్షులు, శ్రీ సేద్య రైతు సేవా సంస్థ, నల్లగొండ

ఎత్తు మడులు..

పంట ఏదైనా ఎత్తు మడుల (బోదెల)పైనే విత్తుతారు. ఏ మడిలోనైనా ఒకే రకం విత్తుతారు. మడి వెడల్పు పెరిగే కొద్దీ ఎత్తు తగ్గుతూ ఉంటుంది. ఏ రోజు చూసినా 6 రకాల ఆకుకూలు దిగుబడి తీస్తున్నారు. ఆకుకూరలు సాగు చేసే ఎత్తు మడి వెడల్పు 42 అంగుళాలు, ఎత్తు 5–6 అంగుళాలు ఉంటుంది. తీగజాతి మొక్కలు, కూరగాయ మొక్కలు నాటే మడులు పంటను బట్టి 18 నుంచి 24 అంగుళాల వెడల్పు, 12 నుంచి 9 అంగుళాల ఎత్తు ఉంటాయి. సాధారణం కన్నా రెట్టింపు సాంద్రతలో విత్తటం ద్వారా చోటు వృథా కాకుండా రెట్టింపు దిగుబడి పొందేలా జాగ్రత్త తీసుకుంటారు. కీర, పుచ్చ, దొండ, పుదీన, టమాటో, పచ్చి మిరప, వంగ వంటి పంటలు ఏడాది పొడవునా ఉంటాయి. పెద్ద మడులపై రెండు వరుసలు డ్రిప్ వేస్తున్నారు. ఆపైన మల్చింగ్ షీట్ వేస్తారు. అవసరం మేరకు నిలువు /శాశ్వత పందిళ్లు వేస్తారు. మిగతా రకాలు దశల వారీగా సాగు చేసేలా.. ఏడాది పొడవునా అక్కడి మార్కెట్ డిమాండ్‌కు అనుగుణంగా ఏ యే పంటను ఎన్ని గుంటల్లో విత్తుకోవాలన్న ప్రణాళిక రూపొందించి, పాటించటం 'శ్రీ సేద్య'ం ప్రత్యేకత.

పది నెలలుగా ఇంటి కూరగాయలే

- లాక్‌డౌన్ కాలంలో శ్రీకారం
- గ్రోబాగ్స్, కుండీలతో పాటు హైడ్రోపోనిక్స్ పద్ధతిలో ఆకుకూరలు సాగు

కిరణ్మయి

హైడ్రోపోనిక్స్ పద్ధతిలో పెరుగుతున్న ఆకుకూరలు

చుట్టూ పచ్చని వాతావరణం.. ఉదయం లేవగానే పలకరించే పూలు.. తాజా సేంద్రియ కూరగాయలు, ఆకుకూరలు, పండ్లు... ఇవన్నీ పట్టణంలోనే మన ఇంటిపైనే అందుబాటులోకి తెచ్చుకుంటే అంతకన్నా ఆనందం ఏమి ఉంటుంది.

డా. వేదప్రకాశ్, కిరణ్మయి దంపతులు కామారెడ్డి జిల్లా కేంద్రంలోని దేవునిపల్లి గాయత్రీ నగర్‌లోని తమ ఇంటిపై ఎంతో శ్రద్ధగా కిచెన్ గార్డెన్‌ను ఏర్పాటు చేసుకున్నారు. బీఈడీ కళాశాల ప్రిన్సిపాల్‌గా డా. వేదప్రకాశ్ పనిచేస్తున్నారు. 280 చదరపు గజాల ఇంటి పైకప్పుపై ఆకుకూరలు, కూరగాయలు, పండ్ల మొక్కలతో ఒక పచ్చని లోకాన్ని సృష్టించారు. ఇటు కుండీలు, గ్రోబాగ్స్‌లోను.. అటు హైడ్రోపోనిక్స్ పద్ధతిలోనూ ఇంటి పంటలు సాగు చేసుకొని పది నెలలుగా తింటున్నారు. లాక్‌డౌన్ సమయంలో పది నెలల క్రితం డా. వేదప్రకాశ్ ఈ మిద్దె తోటకు శ్రీకారం చుట్టారు. కోతుల నుంచి కాపాడుకునేందుకు ఇనుప జాలీని ఏర్పాటు చేస్తూ ఇంటికి కావలసిన కూరగాయలన్నీ పండిస్తున్నారు. రసాయనిక అవశేషాల్లేని కూరగాయలను బంధువులు,స్నేహితులకూ రుచి చూపిస్తున్నారు. వేదప్రకాశ్‌తో పాటు కుటుంబ సభ్యులందరూ ఇంటి పంటల సాగు పనులు చూసుకుంటున్నారు.

ట్రేలు, కవర్లు, కుండీల్లో పెరుగుతున్న కూరగాయలు, పండ్లు, పూల మొక్కలు

32 రకాల కూరగాయల సాగు

వేదప్రకాశ్ ఇంటి పైకప్పుపై 32 రకాల కూరగాయలు సాగవుతున్నాయి. బీర, కాకర, దోస, గుమ్మడి, చిక్కుడు, సోరకాయ, క్యాబేజీ, కాలీఫ్లవర్, క్యారెట్, వంకాయ, టమాట, చిక్కుడు, మిర్చి, క్యాప్సికం, అల్లం, వెల్లుల్లి, ఆలు, ఇలాయిచీ వంటివి పండిస్తున్నారు. అలాగే పాలకూర, తోటకూర, మెంతి, కొత్తిమీర, గోంగూర, బచ్చలి, బిర్యానీ ఆకును అక్కడ పండిస్తున్నారు. అలాగే మామిడి, అరటి, యాపిల్ చెర్రీ, వాటర్ యాపిల్, స్ట్రాబెర్రీ, గ్రేప్స్, సింగపూర్ చెర్రి, జామ, దానిమ్మ, డ్రాగన్ ఫ్రూట్స్, నిమ్మ, ఆరెంజ్, బత్తాయి, బాదాం, పనస, మునగ వంటి పండ్లు, కాయల చెట్లు పెంచుతున్నారు.

అప్పటి నుంచి మార్కెట్‌కు వెళ్ల లేదు

వేదప్రకాశ్ తన ఇంటిపైకప్పుపై పండిస్తున్న కూరగాయలు వాళ్ల ఇంటి అవసరాలకే కాకుండా, ఇరుగు పొరుగు వారికి, బంధువులు, స్నేహితులకు ఇస్తున్నారు. గడచిన పది నెలలుగా మార్కెట్‌లో అడుగు పెట్టలేదని కిరణ్మయి తెలిపారు. ఇంటి అవసరాలకు కావలసిన అన్ని రకాల కూరగాయలు అక్కడే లభిస్తున్నాయి. మార్కెట్లో లభించనివి కూడా మిద్దెపై అందుబాటులో ఉన్నాయి. ఇంట్లో ఈ రోజు ఏ కర్రీ వండుకోవాలో మిద్దెపైకి వెళ్లి అక్కడ చూసి నిర్ణయం తీసుకుంటారు. క్షణాల్లో తమకు కావలసిన కూరగాయలను కోసుకుని వెళ్లి వండుకోవడం జరుగుతోంది.

ఇంటిపంటల మధ్య వెదురు బొంగులతో వేసిన కుటీరం ఎంతో ఆహ్లాదాన్ని పంచుతోంది. పండుగల పూట, బంధువులు, స్నేహితులు వచ్చినపుడు అందరూ అక్కడే కూర్చుని భోజనాలు చేస్తున్నారు. రాత్రి పూట రంగురంగుల విద్యుద్దీపాల మధ్యన విందులు చేసుకుంటున్నారు. ఇంటికి ఎవరు వెళ్లినా మిద్దెపైకి తీసుకువెళ్లి అంతా చూయిస్తారు. తిరిగి వెళ్లేటపుడు కూరగాయలు కత్తిరించి చేతిలో పెట్టి పంపించడం వాళ్లకు ఆనవాయితీగా మారింది.

– ఎస్.వేణుగోపాలచారి, సాక్షి, కామారెడ్డి

పంట చేలో ఉన్నంత ఆనందం

మిద్దె మీద కూరగాయలు, ఆకుకూరలు పండించుకుంటున్నాం. పది నెలల కాలంగా మార్కెట్‌కు వెళ్లే అవసరం రాలేదు. ఇంట్లో అందరం పొద్దున లేస్తే చాలు మిద్దెపైకి రావడం, మొక్కలకు నీళ్లు పట్టడం, వాటిని చూసుకోవడం అలవాటైంది. మనకు కావలసిన కూరగాయలు మనమే పండించుకుంటే ఎంత ఆనందాన్ని పొందవచ్చో మాకు అర్థమైంది. ఎలాంటి రసాయనాలు లేకుండా కూరగాయలు పండిస్తున్నాం. పండుగల సందర్భంగా అందరం కలిసి ఇక్కడే భోజనం చేస్తుంటే పంట చేను దగ్గర తిన్నంత తృప్తి కలుగుతోంది.

– డాక్టర్ వేదప్రకాశ్ (95531 81399), కామారెడ్డి

మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా లేక సాక్షి బదులుగా ఇతర దినపత్రికలు వేస్తున్న యెడల టోల్ ఫ్రీ నెంబర్‌కు ఉ. 7.00 గం.ల నుండి రా. 8.00 గం.ల లోపు తెలుపగలరు. వెంటనే తగు చర్యలు తీసుకోబడును. టోల్ ఫ్రీ నం: 1800 425 9899